జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 180 బుధవారం 26 నవంబర్- 2025 పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# అయోధ్య రామ మందిరంపై

# కాషాయ పతాకం..

## ప్రధాని మోదీ, భగవత్ చేతుల మీదుగా ధ్వజారోహణం



- అయోధ్య రామ మందిరంపై కాషాయ పతాకం ఆవిష్కరణ
- ప్రధాని మోదీ, మోహన్ భగవత్ చేతుల మీదుగా ధ్వజారోహణ ఉత్సవం
- పారాచ్యూట్ నిపుణుడిచే ప్రత్యేకంగా తయారైన 22 అడుగుల జెండా
- మందిర నిర్మాణ పూర్తికి గుర్తుగా ఈ కార్యక్రమం
- రామ దర్బార్, సప్త మందిరాల్లో ప్రధాని ప్రత్యేక పూజలు

అయోధ్య,(సందేశం టైమ్స్): రామజన్మభూమి ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఇవాళ ఆలయ శిఖరంపై పవిత్ర కాషాయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ 'ధ్వజారోహణ్ ఉత్సవ్' కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు. ఈ వేడుకతో ఆలయ నిర్మాణ ప్రక్రియ సంపూర్ణమైంది. ఆలయం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ జెండా 22 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పు ఉంది. గుజరాత్ లోని అహ్మదాబాద్‌కు చెందిన ఒక పారాచ్యూట్ నిపుణుడు దీన్ని తయారు చేశారు. సుమారు 2 నుంచి 3 కిలోల బరువుండే ఈ జెండా, ఎత్తైన ప్రదేశాల్లో బలమైన గాలులను సైతం తట్టుకు నేలా రూపొందిం చబడింది. శ్రీరాముడి సూర్య వంశ వారసత్వానికి ప్రతీకగా సూర్యుడి చిహ్నంతో పాటు ఓం, కోవిదార వృక్షం గుర్తులు ఈ జెండాపై ఉన్నాయి.అంతకుముందు ప్రధాని మోదీ, భగవత్ వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీరామ దర్బార్ గర్భగృహంలో శ్రీరామ లల్లాకు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యకు చేరుకున్న ప్రధానికి ఘన స్వాగతం లభించింది. సాకేత్ కాలేజీ హెలిప్యాడ్ వద్ద సీఎం యోగి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని రోడ్‌షోలో పాల్గొని ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఆలయ ప్రాంగణంలోని సప్త మందిరా లను కూడా సందర్శించారు. మహర్షి వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, అహల్య, నిషాదరాజ గుహ, మాతా శబరిలకు అంకితం చేసిన ఈ ఆలయా ల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం శేషావతార్, మాతా అన్నపూర్ణ మందిరాల్లోనూ పూజలు నిర్వహించారు. ఈ పతాకం కేవలం మతపర మైన భక్తికి మాత్రమే కాకుండా భారతదేశ సనాతన సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నమని నేతలు పేర్కొన్నారు.

# రాయలసీమలో

# ఉద్యాన పంటల అభివృద్ధిపై సర్కార్ ఫోకస్



అమరావతి,(సందేశం టైమ్స్): రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు (మంగళవారం) సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా

మిగతాది 2లో

# ఏపీలో కొత్తగా మూడు జిల్లాలు..

## సీఎం అంగీకారం



అమరావతి,(సందేశం టైమ్స్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం అంగీకారం తెలిపారు. ముందు నుంచి చెబుతున్నట్టుగా మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు అంగీకరించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సమీక్ష నిర్వహించిన అనంతరం మార్పు చేర్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించారు.

అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయించారు. కర్నూలు జిల్లా పెద్ద హరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా.. ఆదోని మండలాన్ని విభజించి కొత్త మండలం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఇక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ఈ సాయంత్రం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

# ఉగాదిలోగా 5 లక్షల ఇళ్లు పూర్తి:

## మంత్రి పార్థసారథి



అమరావతి,(సందేశం టైమ్స్): ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు. గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

# మన సంస్కృతి, నాగరికత..

## దేశానికి పునాది వంటివి..



2 లో

అమరావతి,(సందేశం టైమ్స్): మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు.

# హక్కుల గురించి మాట్లాడతారు కానీ...

## బాధ్యతల గురించి ఆలోచించరు: మంత్రి నారా లోకేశ్

- మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థినిని అభినందించిన మంత్రి లోకేశ్
- హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచన
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన భోజనం అందించేందుకు కృషి
- విద్యార్థిని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా
- మంగళగిరి తన కుటుంబంలా మారిపోయిందని లోకేశ్ వ్యాఖ్య

2 లో



అమరావతి,(సందేశం టైమ్స్): రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అందరూ మాట్లాడతారని, కానీ బాధ్యతల గురించి ఆలోచించరని, హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు.

# పరకామణి చోరీ కేసు

## భూమన కరుణాకర్ రెడ్డికి నోటీసులు



తిరుపతి,(సందేశం టైమ్స్):: తిరుమల పరకామణి చోరీ కేసుకు సంబంధించి వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కి సిఐడి అధికారులు నోటీసులు జారీ చేశారు. తిరుమల వేంకటేశ్వరుడి పరకామణిలో 920 అమెరికన్ డాలర్లను చోరీ చేస్తూ పట్టుబడిన పకరామణి ఉద్యోగి రవిపై 2023 ఏప్రిల్ 7 న కేసు నమోదైంది.

2 లో

# డ్యూటీలో మతపరమైన దీక్షలు కుదరవు..

## సెలవు తీసుకోవాల్సిందే: తెలంగాణ పోలీసు శాఖ కఠిన ఆదేశాలు

విధి నిర్వహణలో దీక్షా వస్త్రాలు ధరించవద్దని ఆదేశం
నిబంధనలు ఉల్లంఘించిన కంచన్‌బాగ్ ఎస్సైకి మెమో
గడ్డం, జుట్టు పెంచడంపైనా నిషేధం

# రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సర్కార్ ఫోకస్

ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ధి కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఉగాదిలోగా 5 లక్షల ఇళ్లు పూర్తి: మంత్రి పార్థసారథి

మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు. 18 లక్షల ఇళ్లు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

## మన సంస్కృతి, నాగరికత.. దేశానికి పునాది వంటివి..

వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం (జెండా ఎగురవేయడం) కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# పరకామణి చోరీ కేసు భూమన కరుణాకర్ రెడ్డికి నోటీసులు

అప్పట్లో టిటిడి ఏవీఎస్వోగా పనిచేసిన సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు తిరుమల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. దీంతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగఅహంలోని కార్యాలయంలో.. భూమన విచారణకు రావాలని నోటీసులో అధికారులు పేర్కొన్నారు. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా ఈ కేసు విచారణ చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణిలో కేసు దర్యాప్తు చేపట్టిన సిఐడి బఅందం డిసెంబరు 2వ తేదీలోగా నివేదిక ఇచ్చేందుకు విచారణ చేపట్టింది. అదే సమయంలో విచారణ కోసం వస్తున్న ఏవీఎస్వో సతీష్ కుమార్ మఅతి చెందడంతో దర్యాప్తులో కొంత ఆలస్యం జరిగింది. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగఅహంలో అప్పటి టిటిడి వీజీవో గిరిధర్‌ను విచారించారు. పరకామణి అధికారులు మొదట మీకు సమాచారమిచ్చారా ? అని ఆరా తీశారు. చోరీపై టిటిడి విజిలెన్స్ విభాగం ఎలాంటి విచారణ చేపట్టింది, సంబంధిత దస్త్రాలు, ఇతర వివరాలు ఎవరికి సమర్పించారని ఆడిగినట్లు సమాచారం. తాము సేకరించిన విషయాలు అప్పటి సీవీఎస్వో నరసింహకిశోర్‌కు తెలియజేసినట్లు గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. అలాగే కేసు రాజీలో సతీష్ కుమార్‌కు ఏమైనా సలహాలు ఇచ్చారా ? ఆయనపై ఎవరిదైనా ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారా ? అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి.. సరిగ్గా గుర్తించలేదని గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత అప్పటి ఏవీఎస్వో పద్మనాభంను ప్రశ్నించారు. కేసు గురించి ఏమి తెలుసునని విచారణ చేపట్టారు.


## డ్యూటీలో మతపరమైన దీక్షలు కుదరవు..

తెలంగాణ పోలీసు శాఖ తమ సిబ్బంది మతపరమైన దీక్షలు చేపట్టడంపై కీలక, కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. అయ్యప్ప దీక్ష వంటి మతపరమైన దీక్షల్లో ఉన్నవారు విధి నిర్వహణకు హాజరుకాకూడదని, తప్పనిసరిగా సెలవు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి డ్యూటీలో దీక్షా వస్త్రాలతో కనిపించినందుకు సౌత్ ఈస్ట్ జోన్‌కు చెందిన కంచన్‌బాగ్ ఎస్సై కృష్ణకాంత్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు. ప్రస్తుతం అయ్యప్ప దీక్షల సీజన్ కావడంతో కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు చాలామంది సిబ్బంది మాల ధరించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు యూనిఫామ్ లేకుండా నల్ల దుస్తులు, నల్ల కండువాలు ధరించడం, షూస్ లేకుండా తిరగడం వంటివి చేయరాదని హెడ్ ఆఫీస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అలాగే, పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు జుట్టు, గడ్డం పెంచుకోవద్దని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, మతపరమైన దీక్షలను శాఖ వ్యతిరేకించడం లేదని, క్రమశిక్షణకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీక్ష చేపట్టాలనుకునే వారు ముందస్తుగా అనుమతి తీసుకుంటే రెండు నెలల వరకు సెలవులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీక్షలో ఉంటూ విధులకు హాజరుకావడం మాత్రం నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పారు.

# హక్కుల గురించి మాట్లాడతారు కానీ... బాధ్యతల గురించి ఆలోచించరు: మంత్రి నారా లోకేశ్

మంగళగిరిలోని మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మ, రేపు జరగనున్న 'స్టూడెంట్ మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ, పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యువశక్తి ప్రాధాన్యత గురించి తరచూ చెబుతుంటారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహిం చాలనే ఆలోచనను సీఎం గారితో చర్చించి నిర్ణయించాం" అని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిం చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ వివరించారు. "అమ్మకు చెప్పలేని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సులో చక్కగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ప్రతి ఏటా స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని, కనకపుట్లమ్మను చూసి మరో పది మంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా, "రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?" అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి సీఎం, స్పీకర్ హాజరవుతున్నం దున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాక్ అసెంబ్లీకి ఎంపికవడంపై విద్యార్థిని ఆనందం వ్యక్తం చేస్తూ, ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం గతంలో కంటే మెరుగ్గా ఉందని తెలిపింది. దీనిపై స్పందించిన లోకేశ్, రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థిని కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పుట్టుకతో దివ్యాంగుడైన ఆమె తండ్రి రాము, ట్రై-స్కూటర్‌పై కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారని తెలుసుకున్నారు. తమ ఇద్దరు కుమార్తెలకు 'తల్లికి వందనం' పథకం అందుతోందని, తనకు రూ.6,000 పింఛన్ వస్తోందని రాము మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన లోకేశ్, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. "మంగళగిరి నా కుటుంబంలా మారిపోయింది. నాపై మరింత బాధ్యత పెరిగింది" అని అన్నారు. విద్యార్థిని శ్రీ కనకపుట్లమ్మ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మంత్రిని కలవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రొవిజనల్ అసైన్‌మెంట్‌పై సైనికులకు సంపూర్ణ హక్కులు




అమరావతి, నవంబరు25(సందేశం టైమ్స్): ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద సైనికోద్యోగులకు భూకేటాయింపులు, వాటి అమ్మకానికి సంబంధించి పలు అంశాలపై స్పష్టత ఇస్తూ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ప్రొవిజనల్ అసైన్‌మెంట్ చేసినప్పటికీ సైనికోద్యోగులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. భూమిని విక్రయించేందుకు అనుమతిస్తూ 2010 మార్చి 3న రెవెన్యూ కార్యదర్శి మెమో జారీ చేశారని గుర్తు చేసింది. ప్రొవిజనల్ అసైన్‌మెంట్ అనంతరం భూమిని సాగులోకి తీసుకొస్తే డీఫామ్ పట్టా జారీ లాంఛనప్రాయమేనని పేర్కొంది. డీఫామ్ పట్టా జారీలో జాప్యం చోటు చేసుకుందనే కారణంతో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద లభించే ప్రయోజనాలను సైనికోద్యోగులకు దూరం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో (మాజీ) సైనికోద్యోగి(అప్పీల్‌దారు) గత 40 ఏళ్లుగా భూమిని సాగు చేస్తున్నారని, ఈ నేప?థ్యంలో భూమిని విక్రయించేందుకు అతనికి హక్కులు ఉన్నాయని స్పష్టం చేసింది. ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని అసైన్ చేయడానికి వీల్లేదన్న అధికారుల వాదనను తిరస్కరించింది. అప్పీల్‌దారుకు భూకేటాయింపు చేసిన సర్వే నం.75లోనే ఇతరులకు కూడా భూమిని అసైన్ చేశారని గుర్తు చేసింది. వారు ఆ భూమిని ల్యాండ్ పూలింగ్ కింద వీఎంఆర్‌డీఏకు అప్పగించారని, అందుకు బదులుగా వారు ప్లాట్లు పొందారని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఇసుక దిబ్బల పోరంబోకు భూమిని ఎందుకు అసైన్ చేయకూడదనే విషయంపై స్పష్టత లేదని పేర్కొంది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, సర్వీసులో ఉన్న సైనికోద్యోగులు అసైన్‌మెంట్‌కు అర్హులేనని మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇందుకు సంబంధించి గతంలో తీర్పులు ఉన్నాయని గుర్తు చేసింది. మాజీ సైనికోద్యోగి అప్పారావుకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని, తీర్పు ప్రతి అందిన నాటి నుంచి ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం జారీ చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

# కొలిక్కిరాని జిల్లాల పునర్విభజన

అమరావతి బ్యూరో : నవంబరు25 (సందేశం టైమ్స్): జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మండలాల భౌగోళిక స్వరూపాల మార్పు, పాలనాపరమైన సౌలభ్యం వంటి కీలకాంశాలపై సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ, అధికారులతో సమీక్షా సమావేశం ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. దీంతో మంగళవారం మరోసారి భేటీ కావాలని నిర్ణయించినట్లు సమాచారం. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలపై మరోసారి అధ్యయనం చేయాలని సిఎం మంత్రులకు సూచించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్డినెన్స్ ద్వారా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు నూతనంగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 28న జరుగునున్న కేబినెట్ సమావేశంలో కూలంకషంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ప్రాంతాన్ని అంతా కలిపి ప్రత్యేకంగా ఒక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుకుంటుండగా, ప్రభుత్వం ఆ దిశగా కాకుండా రంపచోడవరం కేంద్రంగా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అథారిటీలో ఐఎఎస్ స్థాయి అధికారిని నియమించడం ద్వారా పరిపాలనా సౌలభ్యం సులభంగా ఉంటుందని అంచనావేస్తు న్నారు. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు పునరావాసకేంద్రాలు, ఆర్‌ఓఆర్ అమలుతోపాటు, ప్రభుత్వం విడుదల చేసే నిధులు స్థానికంగా గిరిజనులకు అందించేందుకు డెవలప్‌మెంట్ అథారిటీ ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది ఇలా ఉంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థలు, రాజకీయ నేతల నుంచి రాష్ట్రవ్యాప్తంగా మార్పులు, చేర్పులు విషయంపై పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. ఇందులో ప్రభుత్వ పరిశీలనలో ఆరు రెవెన్యూడివిజన్లు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నప్పటికీ భౌగోళిక,స్థానిక పరిస్థితుల దృష్ట్యా, వాటిని రెంటికి కుదించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకిని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి, తిరుపతి జిల్లాలోని గూడూరును ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి మార్చేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక విజయవాడ విషయానికి వస్తే పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిస్థితి ప్రభుత్వానికి తలనొప్పిగా మారడంతో ఈ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం దొరికే అవకాశాలు లేవని తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో కలిపారు. అక్కడి ప్రజలు , ప్రజాప్రతినిధులు గతంలో మాదిరిగానే ప్రకాశం జిల్లాలో కలపాలనే వత్తిడి ఉన్నప్పటికీ రామాయపట్నం పోర్టు దృష్ట్యా ప్రకాశంలో కలిపితే పాలనాపరమైన ఇబ్బందులు తప్పవనే ఆలోచన నేపథ్యంలో కందుకూరు విషయంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నట్లు సమాచారం.

# దారుణం.. ఆర్టీసీ డ్రైవర్లపై దాడి..

ఎన్టీఆర్ జిల్లా, నవంబరు25 (సందేశం టైమ్స్): జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లపై దాడికి పాల్పడినందుకు గానూ.. డ్రైవర్లంతా మూకుమ్మడిగా నిరసనకు దిగారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్‌పై ఓ రౌడీ షీటర్ దాడి చేశాడు. మరోవైపు ఆర్టీసీ డిపోలో మరో డ్రైవర్‌పై కొందరు ఆటో డ్రైవర్లు దాడికి పాల్పడ్డారు. బాధిత డ్రైవర్లకు మద్దతుగా హైర్ బస్ ఓనర్లు, ఆర్టీసీ కార్మికులంతా బస్సులు సర్వీసులు నిలిపివేసి నిరసనకు దిగారు. ఆర్టీసీ కార్మికులంతా ఒక్కసారిగా నిరసనకు దిగడంతో.. సుమారు 32 బస్ సర్వీసులు ఆగిపోయాయి. జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో హైర్ బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, పల్లెవెలుగు బస్సులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ ఘటనపై స్థానిక డిపో మేనేజర్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్టీసీ డిపో సహా బస్టాండ్ ఏరియా అంతా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులంతా అసహనానికి గురయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించేందుకు వెళ్తే బస్సులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని పరిస్థితి సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.



## మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో మార్పు...

# ఆందోల్‌లో వడ్డీ లేని రుణాల పంపిణీ



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి : నవంబర్ 25: సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలను మంగళవారం పంపిణీ చేశారు. మహిళా ఉన్నతి%–%తెలంగాణ ప్రగతి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ %ు% టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై చెక్కులను అందజేశారు. మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. మహిళా సాధికారతే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...అందోల్ నియోజకవర్గంలోని 4039 మహిళా సంఘాలకు రూ.4.52 కోట్లు, జిల్లాలో 15909 సంఘాలకు మొత్తం రూ.18.25 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శకాలు అవుతున్నాయన్నారు .పావలా వడ్డీ రుణాలను ప్రవేశపెట్టిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిదే. 1994లోనే మహిళా సంఘాలను బలోపేతం చేసిన ప్రభుత్వ నాయకత్వం ఆయనదే. కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం కూడా సంఘాలకు మద్దతు ఇచ్చింది. అయితే గత పది సంవత్సరాలుగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల గురించిన మాటే లేకుండా పోయింది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను తిరిగి ఆర్థికంగా బలపరుస్తోంది అని మంత్రి దామోదర్ వివర్శించారు.భయహస్తం, ఆమ్ ఆద్మీ బీమా, గృహ జ్యోతి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు క్యాంటీన్లు%–%పెట్రోల్ పంపుల కేటాయింపు, సన్న బియ్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గ్రూపులకు భాగస్వామ్యం ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలని ఆయన గుర్తుచేశారు.మ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఇందిరమ్మను అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇందిరమ్మ ఉక్కు మహిళ. బ్యాంకులను జాతీయాకరించిన ఘనత ఆమెదే. భూమిలేని పేదలకు భూములు కేటాయించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది కూడా ఇందిరమ్మే అని మంత్రి తెలిపారు.సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తుండటం, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూ, నర్సింగ్, పాలిటెక్నిక్, మోడల్ కాలేజీల ఏర్పాటు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్ ప్రాధాన్యతతో కొనసాగుతున్నాయని వివరించారు.మహిళలు బాధ్యత, నిబద్ధత, కుటుంబాలను నిలబెట్టే శక్తి కలిగినవారు. ఆలోచన శక్తి, తరక శక్తి మహిళల్లో అపారంగా ఉంది. వారిని విద్యావంతులు చేసి, నైపుణ్యాలను పెంపొందిస్తే సమాజ అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ప్రపంచంలో ఏ దేశమైనా మహిళా సాధికారత ఉన్నప్పుడే అభివృద్ధి చెందుతుంది అని మంత్రి పేర్కొన్నారు.మండల



సమాఖ్యలు, జిల్లా సమాఖ్యలు జాతీయ రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి దరఖాస్తు చేయాలని సూచిస్తూ, ఆ భూములపై మహిళా సంఘాలు వ్యాపారాలు చేపట్టేందుకు లోన్లు, అవకాశాలు అందిస్తామని అన్నారు. మహిళలు కొత్త వ్యాపార ప్రణాళికలు రూపొందించి మరిన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో రూ.50 కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం మా ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి పేర్కొన్నారు.

# జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

## - ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25నవంబర్: సంగారెడ్డి జిల్లా లో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులు, ఎస్ హెచ్ఓలకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాల మేరకు, ఎస్ హెచ్ఓలు తమ తమ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. పోలింగ్ స్టేషన్ల లొకేషన్లు, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకల పరిస్థితులపై స్థానిక ఎన్నికల అధికారులతో చర్చించారు.

గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన, చెడు నడతగా గుర్తింపు పొందిన వ్యక్తులను ముందస్తుగా బౌండ్ ఓవర్ చేయాలని, అవసరమైన చోట కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. దానికి అనుగుణంగా హిస్టరీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తులకు పోలీసులు సత్ప్రవర్తనపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

# ఖాదిరాబాద్ గ్రామంలో ఇందిరా మహిళ శక్తి చీరాల పంపిణీ...



సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి ( నవంబర్ 25): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశానుసారం వట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి ఆధ్వర్యంలో ఖాదిరాబాద్ గ్రామం లో డ్వాక్రా మహిళ సంఘాల మహిళలకు "ఇందిరా మహిళ శక్తి" చీరలు పంపిణీ చేయడం జరిగింది.మహిళ సంఘం అధ్యక్షుడు వడ్ల కృష్ణ, మహిళ సంఘం అధ్యక్షురాలు శశికళ, సెక్రెటరీ మల్లేశం సార్ ఈ కార్యక్రమంలో వట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు %ు% ఖాదిరాబాద్ మాజీ సర్పంచ్ ప్రతాప్ రమేష్ జోషి , గ్రామ అధ్యక్షులు పడమటి గాలయ్య , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నె ఈశ్వరయ్య సార్, సీనియర్ నాయకులు మైకోటి దత్తు, బిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ చేవెళ్ల శ్రీనివాస్, మల్లారెడ్డి, రుద్రారం రాములు, మాణిక్యం, రాంరెడ్డి, మోహన్ రెడ్డి, స్వామి, కిష్టా గౌడ్, అంబేద్కర్, ఇస్మాయిల్,ఆరీఫ్, మల్లేశం, కృష్ణ, రాజు ముదిరాజ్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొర్రెకల్ గ్రామంలో 'ఇందిరా మహిళ శక్తి' చీరల పంపిణీ

## బోయిని సత్యం



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25నవంబర్ సంగారెడ్డి జిల్లా: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య%–%ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు వట్‌పల్లి మండలంలో 'ఇందిరా మహిళ శక్తి' చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బోయిని సత్యం ఆధ్వర్యంలో గొర్రెకల్ గ్రామంలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు చీరలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు, సభ్యులు, మరియు కృష్ణ గౌడ్, సుధాకర్, శ్రీకాంత్, దాసు, రవి, చాకలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అందరికీ చేరాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

## లాంఛనంగా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల.అధికారి రాణీ కుముదిని..!

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 25నవంబర్

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు

వెంటనే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ప్రకటించిన కమిషనర్...


మూడు విడతల్లో ఎన్నికలు

డిసెంబర్ 11వ తేదీన తొలి విడత,

డిసెంబర్ 14వ తేదీన రెండో విడత,

డిసెంబర్ 17వ తేదీన మూడో విడత ఎన్నికలు నిర్వహణ

మొదటి విడత ఎన్నికల నామినేషన్లు నవంబర్ 27వ తేదీ నుండి..రెండవ విడత నామినేషన్లు నవంబర్ 30వ తేదీ నుండి...మూడవ విడతకు సంబంధించిన నామినేషన్లు డిసెంబర్ 3వ తేదీ నుండి ప్రారంభమవుతాయి...పోలింగ్ ఉదయం ఏడు గంటల ముందు మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్...



పోలింగ్ ముగిసిన వెంటనే గంట విరామం ఇచ్చి ఓట్ల లెక్కింపు మొదలు పెడతారు...లెక్కింపు పూర్తైన వెంటనే వివాదాలు ఏమీ లేకపోతే ఫలితాలు కూడా ప్రకటిస్తారు..ఫలితాలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే ఎన్నికల అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియచేసే అవకాశం ఉంటుంది..

# హైదరాబాద్ ఇఎస్ఐలో ప్రమాదం



నవంబరు25(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రం సనత్‌నగర్ ఇఎస్ఐ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనానికి పెట్టిన సెంట్రింగ్‌తో పాటు స్లాబ్ కుప్పకూలింది. ఈ సంఘటనలో ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం.. సనత్ నగర్ ఇఎస్ఐ ఆస్పత్రిలోని ఎమర్జన్సీ విభాగంలో భవన ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. సాయంత్రం ఎప్పటిలానే కార్మికులు పని చేస్తుండగా సెంట్రింగ్‌తో పాటు శ్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. సెంట్రింగ్ రాడ్లతో పాటు శ్లాబ్ కాంక్రీట్ శిథిలాలు కార్మికులపై పడటంతో అక్కడే పని చేస్తున్న భానుచందర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. రఘుపతి, మోహన్, మల్లేష్, మైసయ్య అనే కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఇఎస్ఐ ఆస్పత్రి మల్టీ స్పెషాలిటీ బ్లాక్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా, వీరి లో రఘుపతి, మోహన్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఇఎస్ఐ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ శిరీష్ కుమార్ చవాన్ తెలిపారు. భానుచందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# కత్తులతో ఇంటి యజమానిని భయపెట్టాలని చూశాడు.. చివరకు



హైదరాబాద్, నవంబరు25(సందేశం టైమ్స్):ఇంటి యజమానిపైనే దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమ్మిన వ్యక్తిగా ఉంటూనే యజమానికి హానీ తలపెట్టాలని భావించాడు ఆ వ్యక్తి. అనుకున్నదే తడవుగా పథకం రచించాడు. అతనికి తోడుగా మరో ఐదుగురిని వెంట తెచ్చుకున్నాడు. ఏకంగా కత్తులతో బెదిరించి, భయపెట్టి మరీ ఇంట్లో దోపిడీ చేయాలని యత్నించాడు. చివరకు అతడి పాపం పండి ఊచలులెక్కబెడుతున్నాడు. నగరంలోని జూబ్లీహిల్స్‌లో శనివారం (ఈనెల 22) అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.అజయ్ అగర్వాల్ అనే వ్యక్తి జూబ్లీహిల్స్‌లో నివసిస్తున్నాడు. ఆ ఇంటికి రాధాచంద్ చాలా కాలంగా కాపలాదారుడిగా ఉన్నాడు. అజయ్ అతడిని ఎంతగానో నమ్మాడు. కానీ యజమాని ఇంటినే దోపిడీ చేయాలని ప్రయత్నించాడు రాధాచంద్. ఇంట్లోని బంగారం, నగదును దోచుకెళ్లాలని పక్కా ప్లాన్ వేశాడు. ఇందుకోసం మరో ఐదుగురితో కలిసి పథకం వేశాడు. ఈ క్రమంలో గత శనివారం అర్ధరాత్రి ఐదుగురితో కలిసి రాధాచంద్.. అజయ్ ఇంట్లోకి ప్రవేశించాడు.తమ వెంట తెచ్చుకున్న కత్తులతో ఇంటి యజమానిపై దాడికి యత్నించాడు. డ్రైవర్‌ను తాళ్లతో కట్టేసి కత్తులతో దాడి చేశాడు. అంతేకాకుండా అజయ్ కుటుంబ సభ్యులను కూడా నిందితులు భయపెట్టాడు. అర్ధరాత్రి ఇంట్లో నానా హంగామా చేశారు. చివరకు కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు స్పాట్‌కు చేరుకున్నారు. రాధాచంద్ సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటి కాపలాదారే ప్రధాన నిందితుడుగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తల్లిదండ్రులు మందలింపు.. విద్యార్థి ఆత్మహత్య



హైదరాబాద్, నవంబరు25(సందేశం టైమ్స్):పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో 10వ తరగతి విద్యార్థిని శ్రీ వైష్ణవి తీవ్ర మనస్థాపానికి గురై.. అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో జరిగింది. విద్యార్థిని ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని శ్రీవైష్ణవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆమె తల్లిదండ్రుల నుంచి పోలీసులు ఆరా తీస్తున్నారు. హబ్సిగూడలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో శ్రీవైష్ణవి చదువుతోందని పోలీసులు తెలిపారు.

# రాగూర్ తరహాలో డెడ్‌బాడీకి చికిత్స..

## బిల్లు కట్టించుకున్నాక అసలు విషయం చెప్పిన డాక్టర్లు!



మహబూబ్‌నగర్, నవంబరు25(సందేశం టైమ్స్): ఠాగూర్ సినిమాలోని సన్నివేశాన్ని తలపించేలా.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖాన వైద్యులు వ్యవహరించారు. జ్వరం వచ్చిందని మహిళ దవాఖానకు వెళ్తే.. ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నట్టు నమ్మిం చి.. డబ్బులు కట్టించుకున్న తర్వాత.. పరిస్థితి విషమించి మృతి చెందిందని చావు కబురు చల్లగా చెప్పిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నది. మృతురాలి కుటుంబ స భ్యుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ మండలం కోడూర్‌కు చెందిన లలిత(35)కు జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఈ నెల 21న అడ్మిట్ అయ్యింది. %పరీక్షించిన వైద్యులు మహిళ ఊపిరితిత్తుల్లో వాటర్ ఉందని, వెంటనే తీయాలని, లేకుంటే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. సాయంత్రం ఆమె మృతి చెందగా ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్టు కుటుంబ సభ్యులకు చూపించారు. రూ.3 లక్షలకుపైగా బిల్లు చెల్లించిన తర్వాత మృతిచెందిన విషయాన్ని తెలిపారు. దీంతో సోమవారం మృతురాలి కుటుంబీకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో దవాఖానకు చేరుకొని ఆందోళనకు దిగారు. పరిస్థితి విషమించి చనిపోయినా చెప్పకుండా నాటకం ఆడుతూ డ బ్బులు దండుకున్నారని దాడికి యత్నించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు చేరుకోగా రూ.3 లక్షల వరకు చెల్లిస్తామని దవాఖాన యాజమాన్యం చెప్పడంతో ఆందోళన విరమించారు. మహిళ పరిస్థితి విషమంగా ఉందని ముందే చెప్పామని దవాఖాన యాజమాన్యం వెల్లడించింది.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



తాండూర్ :నవంబరు25(సందేశం టైమ్స్): టీబీ ముక్త్ భారత అభియాన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, టీబీ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని తాండూర్ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఝాన్సీ, ప్రసన్న తెలిపారు. మండలంలోని అచ్చలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో వైద్య సిబ్బంది టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.%ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తుందన్నారు . ఆకలి మందగించడం, బరువు తగ్గడం , చెమటలు పట్టడం, గొంతు భాగంలో గడ్డలు ఏర్పడడం తదితర లక్షణాలుంటే టీబీ వ్యాధిగా గుర్తించాలన్నారు.ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం, ప్రతినెల రూ. 1,000 బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో సూపర్‌వైజర్లు తారాబాయి, రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో ఓడ్నాల ప్రసన్న, పంచాయతీ సెక్రటరీ కల్పన, ఏఎన్‌ఎం కే ప్రవీణ, పారిజాత, పుష్పలత, ఎల్టీ హకీమ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



కొల్లాపూర్ రూరల్ నవంబరు25(సందేశం టైమ్స్): పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లి గ్రామానికి చెందిన 30మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి బీరం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వంలో జరిన అభివృద్ధి పనులు మాత్రమే ఉన్నాయి. కాం గ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఫ్రీ బస్సు తప్పా మరొకటి అమలు కావడం లేదన్నారు.%రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యా న్ని ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ఎంతో మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని తీవ్ర నష్టాల పాలు అవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మాది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే మంత్రులు ,ఎమ్మెల్యేలు వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిసి బోరున విలపిస్తున్నా వారిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పూర్తిగా రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకుంటామని ప్రకటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ పార్టీ కాపాడుకుంటుందన్నారు.అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లాపూర్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ వర్గ నాయకులపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతుంది. నాయకులను టార్గెట్ చేసుకొని హత్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన నడుస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వం పై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతుందని ప్రజల దృష్టి మరల్చడానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా పార్ములా ఈ కారు రేసు కేసును పెట్టి జైలు పంపడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని, దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. ఈ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తపేట సింగిల్ విండో అధ్యక్షుడు కట్ట రాజేందర్‌గౌడ్, కుడికిల్ల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భాస్కర్‌రావు. తీర్నాంపల్లి పార్టీ నాయకులు, పెద్దకొత్తపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో జీవో 46 ప్రతులను దహనం చేసిన బీసీ నాయకులు



జగిత్యాల నవంబరు25(సందేశం టైమ్స్): జగిత్యాల జిల్లా కేంద్రంలో (అంబేద్కర్ కూడలి) తహసీల్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జీవో నం 46 ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం బీసీ నాయకుడు చింతల గంగాధర్ మాట్లాడుతూ త్వరలో తెలంగాణ లో జరగబోయే సర్పంచి ఎన్నికలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పరిమితి 50 శాతం కు మించకూడదనే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 46 విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు.చట్టబద్ధత లేని జీవోలు నిలువవని తెలిసి ఎన్నికలకు ముందు అడ్డుగోడలు హామీలు ఇచ్చి, మళ్లీ కోర్టు పరిధిలోకి తీసుకెళ్లి బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని వారున్నారు. చట్టబద్ధత లేని జీవోలను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించలేక, అటు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో బీసీలు బలిపశువులౌతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ యువజన నాయకులు ముకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతం ఉన్నా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు.

# ఇంటర్ విద్యపై పట్టింపేది ?

భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు25(సందేశం టైమ్స్): ఆర్భాటాలు తప్ప ఆచరణలో విఫలమవుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఇంటర్ విద్యపై పట్టింపులేకుండా వ్యవహరిస్తోంది. మండలానికో మోడల్ స్కూల్ అని, నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ అని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ సర్కారు.. భద్రాద్రి జిల్లాలోని ఇంటర్ విద్యార్థుల సమస్యలను కూడా తీర్చలేకపోతోంది. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ అంటూ ప్రారంభోత్సవ సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఏజెన్సీ మండలాల్లో సర్కారు ఇంటర్మీడియట్ కాలేజీలు, వాటిల్లో పరీక్ష కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తోంది.జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ చదువుకోవాలనుకుంటున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంటర్ విద్య అందని ద్రాక్షగా చేస్తోంది. ఫలితంగా పొరుగు మండలాల్లోని ప్రభుత్వ కాలేజీలకు కాలినడకనో, ప్రజా రవాణాలోనే రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు.. పట్టణ ప్రాంతాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లి ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నారు.

(Sandesham Times) TG TEL/25/A0348"Title: Sandesham Times"Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206"Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,"3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206" Phone: 9052045435."Printed at: Sunday Printing Press,"3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006